

ఆమెకు సర్కారు 'ఆసరా'

మహిళాసాధికారతే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. డ్వాక్రా సభ్యులకు ఆర్థిక ఆసరా కల్పిస్తోంది. - 8లో



ఆడపిల్లల పట్ల వివక్ష తగదు

ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఆడపిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. - 8లో



నాక్ గుర్తింపులో పరిశోధన పత్రాలు కీలకం

నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలకమని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎర్రకోట పరేడ్‌కు బొబ్బిలి కుర్రాడు



రెనీత్ శ్రీవత్సవ యోగానందనాయుడు

బొబ్బిలి: బొబ్బిలికి చెందిన కస్నూరు రెనీత్ శ్రీవత్సవ యోగానందనాయుడు ఈ నెల 26న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యాడు. యోగానంద నాయుడు ప్రస్తుతం కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాసరావు, అపర్ణలతో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎస్ఈబీ అధికారుల బదిలీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో వివిధ సెబ్ పోలీస్ స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న పది మంది బదిలీ అయ్యారు. రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.వెంకటరావు శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే కొత్త పోస్టింగ్‌లలో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయనగరం ఎస్ఈబీ వన్ సీఐగా పనిచేస్తున్న బిమదుకుమార్‌ను విశాఖ మహారాణిపేటకు, ఎస్ఈబీ-2 ఇన్‌స్పెక్టర్ పి.రామచంద్రరావును పలాసకు, భోగాపురం సీఐ ఎంఆర్‌వీ అప్పారావును పొందూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే, చీపురుపల్లి సీఐ ఉమామహేశ్వరరావును ఎలమంచిలికి, నెల్లిమర్ల సీఐ జీఎస్ రాజశేఖర్‌నాయుడును టెక్కలికి, గజపతినగరం సీఐ ఎం.విజయలక్ష్మిని రణస్థలానికి, ఎస్.కోట సీఐ ఎస్.ధర్మారావును పాయకరావుపేటకు, కొత్తవలస సీఐ సీహెచ్.రాజేశ్వరిని విశాఖ ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు బొబ్బిలి సీఐ ఆర్.జైభీమ్‌ను సోంపేటకు, విజయనగరం ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న వీవీఎస్ఎస్ శేఖర్‌బాబును పాడేరుకు బదిలీ చేశారు.

ప్రాణం తీసుకున్న ప్రేమికులు

- నదిలోపడి ఒకరు, రైలు కింద పడి మరొకరు మృతి
- ప్రేమ విఫలం కావడమే కారణమా...?



తోటపల్లి ప్రాజెక్టులో దూకి చనిపోయిన పద్మజ

గరుగుబిల్లి: ఒకరి నొకరు ఇష్టపడ్డారు. కొన్నినెలలుగా ప్రేమలో మునిగిపోయారు. విషయాన్ని తల్లి దండ్రులకు చెప్పడంలో విఫలమయ్యారు. వీరిలో ఒకరికి పెద్దలు వివాహం నిశ్చయం చేయడంతో మదనపడ్డారు. తల్లిదండ్రులకు ప్రేమవిషయం చెప్పేందుకు సాహసం చేయలేక, కలిసి బతికేందుకు ధైర్యంచాలక ఒకరి తర్వాత ఒకరు ప్రాణాలు తీసుకున్నారు. ప్రేయసి తోటపల్లి డ్యామ్ నుంచి నదిలో దూకి ప్రాణాలు విడవగా, ప్రియుడు రైలుకింద పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటనకు సంబంధించి ట్రైనీ డీఎస్పీ మహ్మద్ అజీజ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కొమరాడ మండల కేంద్రానికి చెందిన పద్మజ (24), పార్వతీపురం మండలం చినమరికి గ్రామానికి చెందిన వానపల్లి శ్రావణ్‌కుమార్ (26) కొంతకాలంగా ప్రేమించుకొంటున్నారు. శ్రావణ్ ఆంధ్రా యూనివర్సిటీలో హెచ్‌ఆర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు శ్రావణ్ గ్రామానికి వచ్చాడు. పద్మజకు వేరే వారితో పెళ్లి నిశ్చయమైందని తెలియడంతో మనస్థాపానికి గురయ్యాడు. పద్మజకు కూడా తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధం ఇష్టపడకపోవడంతో తోటపల్లి ప్రాజెక్టు వద్ద నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ పార్వతీపురం-కొమరాడ మధ్యన రైలు కింద పడి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పద్మజ మృతదేహం తోటపల్లి ప్రాజెక్టులో శనివారం లభించింది. స్థానిక పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్న ట్రైనీ డీఎస్పీ తెలిపారు. ఎదిగొచ్చిన పిల్లలు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న వలస పక్షులు



ఇదిగో వస్తున్నా...

తిరుగు ప్రయాణం

సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు చేరుకున్న వలసపక్షులు, విద్యార్థులు తిరుగుప్రయాణమయ్యారు. వీరి రాకతో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. విద్యా సంస్థలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో శనివారమే విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరారు. - సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

విధుల్లో చేరిన 400 మంది అంగన్‌వాడీలు



బాడంగి సీడీపీఓకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయనగరం ఫోర్ట్: కలెక్టర్ ఆదేశాల మేరకు కొద్దిరోజులుగా సమ్మెచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది విధుల్లో చేరుతున్నారు. బాడంగి, బొబ్బిలి, విజయనగరం అర్బన్ తదితర ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 400 మంది అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరారు. ఆయా సీడీపీఓలకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

భీమిలి నుంచి ఎన్నికల శంఖారావం



- ఈనెల 27న భీమిలిలో ముఖ్యమంత్రి బహిరంగ సభ
- మూడున్నర లక్షల మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు
- వై నాట్ 175 నినాదంతో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం
- ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సభకు తరలిరావాలి
- విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించనున్నట్టు జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ జిల్లా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైనాట్ 175 నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం కార్యాచరణ రూపొందించగా... మొదటిగా ఉత్తరాంధ్రలోని భీమిలి నియోజకవర్గంలో ఈ నెల 27న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. సభను విజయవంతం చేయడంపై పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావుల నేతృత్వంలో ఇటీవల సమావేశం నిర్వహించారన్నారు. సభాస్థలి ప్రాంతాన్ని నిర్ణయించిన అనంతరం పార్టీ శ్రేణులకు తెలియజేస్తామని చెప్పారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, వాటిని ఆయుధాలుగా చేసుకుని ప్రజల్లోకి వెళ్లి పార్టీని విజయపథంలో నడిపించేలా ముఖ్యమంత్రి బహిరంగ సభలో దిశానిర్దేశం చేస్తారన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 స్థానాల్లో విజయ దుందుభి మోగించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

34 నియోజవర్గాల నుంచి మూడున్నర లక్షల మంది హాజరయ్యేలా...

జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మొట్టమొదటిగా నిర్వహించే భారీ బహిరంగ సభను దిగ్విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. ముందుస్తుగా ఈనెల 25న సభను నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాల రీత్యా 27వ తేదీకి వాయిదా వేశారన్నారు. ఆ రోజు భీమిలిలో జరిగే సభకు ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 34 నియోజకవర్గాల నుంచి మూడున్నర లక్షల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సభను విజయవంతం చేయడంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని కోరారు.

జగన్‌తోనే అంబేడ్కర్ ఆశయం సాకారం

విజయనగరం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయాన్ని సాకారం చేస్తున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయనగరం జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 77 ఏళ్ల స్వాతంత్య్ర భారతావనిలో అంబేడ్కర్ ఆశయాన్ని నెరవేర్చే దిశగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నాటి అంటరానితనం నేటి పెత్తందారీ వ్యవస్థతో పోరాడుతూనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నారని తెలిపారు. దీనికి విజయవాడ నడిబొడ్డున ఏర్పాటుచేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహమే నిలువెత్తు సాక్ష్యమన్నారు. అంబేడ్కర్ ఆశయాలు నేటి యువతకు తెలియజేయాలనే సంకల్పంతో మ్యూజియం, స్మృతివనం ఏర్పాటుచేశారని చెప్పారు.

పెత్తందారీ పత్రికలు విష ప్రచారం

రాష్ట్రంలో ఈనాడు పత్రిక పెత్తందారీ పోకడలతో సామాజిక న్యాయానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై జుగుప్సాకరమైన రీతిలో, మానవహక్కులు ఉల్లంఘించే విధంగా విషపు రాతలు రాస్తోందన్నారు. చంద్రబాబునాయుడుని అందలం ఎక్కించాలనే తపనే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం ఆ పత్రికకు పట్టవన్నారు. ఎన్నికలు వస్తేనే చంద్రబాబునాయుడుకు ప్రజలు గుర్తుకువస్తారని, ఆయన మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

70 శాతం ధాన్యం సేకరణ పూర్తి


జిల్లాలో రైతుల నుంచి 70 శాతం ధాన్యంసేకరణ పూర్తిచేశామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. 3.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యంకాగా, ఇప్పటివరకు 2.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు చెప్పారు. సేకరించిన ధాన్యానికి వెంటవెంటనే రైతుల ఖాతాలకు బిల్లులు జమచేస్తున్నట్టు వెల్లడించారు.

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- ఈ నెల 22, 23, 24 తేదీల్లో శంబర జాతర
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ సునిల్ సొరేన్
- చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించిన జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు



శంబర పోలమాంబ



సిద్ధమైన క్యూలైన్



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏఎస్పీ సునీల్‌సొరెన్



క్యూ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు, ఈఓ సూర్యనారాయణ తదితరులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏఎస్పీ సునీల్‌సొరెన్ పరీక్షించారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తాగు నీరు, పిల్లలకు పాలు, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. శంబర జాతరను రాష్ట్రజాతరగా ప్రభుత్వం గుర్తించిందని, లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు.

జాతరకు పటిష్టబందోబస్తు

పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ సునీల్‌సొరెన్ శంబర గ్రామానికి చేరుకొని జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించారు. జాతరలో బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సీఐ ధనుంజయరావు, ఎస్ఐ నరసింహమూర్తితో చర్చించారు. జాతరలో సుమారు 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. 44 చోట్ల సీసీ కెమెరాలు అమర్చామన్నారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను కేటాయించామని చెప్పారు. సిరిమాను రథాన్ని నడిపే భక్తుల పేర్లు సోమవారం అందిస్తామని చెప్పగా, 50 మందికి మించరాదని ఏఎస్పీ సూచించారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ

- కలెక్టర్ నాగలక్ష్మి
- రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



ప్రచార పోస్టర్‌ను విడుదలచేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, రవాణా శాఖ జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను శనివారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖల ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మాసోత్సవాల షెడ్యూల్‌ను వివరించారు. ఏటా దేశంలో సుమారు నాలుగున్నర లక్షల రోడ్డు ప్రమాదాలు, లక్షా 50 వేల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇవి దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని చెప్పారు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే రహదారి భద్రతా మాసోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎ.వి.రమణ, యు.దుర్గాప్రసాద్, కె.రవిశంకర్ ప్రసాద్, సహాయ మోటార్ ఇన్‌స్పెక్టర్లు వి.శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- బొద్దాం, సోంపురం గ్రామాల్లో సందర్శన
- ప్రకృతి వ్యవసాయంపై ఆకట్టుకున్న నమూనా



బొద్దాంలో తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై వేసిన చక్రం నమూనాను పరిశీలిస్తున్న ఎన్‌జీఓల బృందం

వేపాడ: మండలంలోని బొద్దాం, సోంపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను పది రాష్ట్రాలకు చెందిన ఎన్‌జీఓలు క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. బొద్దాంలో నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాలు, పంట దిగుబడులు, మార్కెటింగ్ తదితర వివరాలను ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనంద్ వివరించారు. తొమ్మిది సార్వత్రిక సూత్రాలను చక్రం రూపంలో వేసి సభ్యులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాగుసేవలను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ కో.ఆర్డినేటర్ కృష్ణారావు, రీజనల్ టెక్నికల్ మెంబర్స్ ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్టీఓ హేమసుందర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, ఏఎస్‌సీఎఫ్ సిబ్బంది వసంత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎవరిదో ఈ బైక్...!



రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనం

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో తంగుడుబిల్లి సమీపంలో ఉన్న మామిడి తోటల వద్ద ఓ ద్విచక్ర వాహనం అనుమానాస్పదంగా ఉంది. సుమారు నెల రోజుల నుంచి రహదారి పక్కనే ద్విచక్ర వాహనం ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఎవరైనా బైక్‌ను దొంగలించి అక్కడ వదిలేసి వెళ్లిపోయారా? ప్రమాదానికి గురైందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు స్పందించి బైక్ ఎవరిదో గుర్తించాలని కోరుతున్నారు.

ఆమెకు సర్కారు ఆసరా

- ఇప్పటికే మూడు విడతల నిధులు అకౌంట్లలో జమ
- జిల్లాలో 36,478 సంఘాలకు రూ.252.13 కోట్ల లబ్ధి
- 23 నుంచి 30 వరకు నాలుగవ విడత చెల్లింపు



ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు (ఫైల్)




పూసపాటిరేగలో ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

పూసపాటిరేగ: మహిళాసాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు అండగా నిలిచారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని మహిళలకు అమలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలు కలిపి విజయనగరం జిల్లాలో 36,478 మహిళా సంఘాలకు రూ.754.13 కోట్లు ఆసరా పథకం కింద నిధులు జమ అయ్యాయి. నాలుగవ విడతలో రూ.252.13 కోట్లు ఈనెల 23 నుంచి 30వతేదీ వరకు జరగబోయే సభలలో మహిళల అకౌంట్లలో జమచేయడానికి ప్రణాళిక సిద్ధం చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఏప్రిల్ 19కి ముందు తీసుకున్న రుణాలను తాము అధికారంలోకి వస్తే నాలుగు విడతలుగా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఈనెల 23 నుంచి మండలాల వారీగా ఆసరా పథకం నిధుల చెల్లింపు కోసం షెడ్యూల్ వారీగా సభలు, తేదీలు ఖరారు చేశారు.

సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా

జిల్లావ్యాప్తంగా ఆసరా పథకానికి సంబంధించి అర్హుల జాబితాను సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం ద్వారా ఇంతవరకు ఆసరా ఎంతమేర జమ అయింది. అలాగే మిగిలిన వాయిదాలకు సంబంధించి ఎంతమేర రుణమాఫీ అవుతుందనే విషయాలపై సంఘం సభ్యులకు వెలుగు అధికారులు, సీసీలు అవగాహన కల్పిస్తున్నారు.

మహిళలకు పెద్దపీట



డ్వాక్రా సంఘాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రుణాలు మాఫీ చేస్తున్నారు.

– తీడ కృష్ణవేణి, పూసపాటిరేగ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



భాగ్యలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. మా సంఘం సభ్యులు అంతా కలిసి బ్యాంకు ద్వారా రుణం రూ.7.50 లక్షలు తీసుకున్నాం. ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికి రుణపడి ఉంటాం.

– షేక్ జరీనా, పూసపాటిరేగ

23 నుంచి చెల్లింపులు



అర్హులైన ప్రతి మహిళకు వైఎస్సార్ ఆసరా పథకం అండగా నిలుస్తోంది. ఎన్నికల ముందు సంఘం సభ్యులకు ఇచ్చిన హామీలలో భాగంగా ఇప్పటికే మూడు విడతలుగా బ్యాంకుల్లో నగదు జమచేశారు. ఈనెల 23 నుంచి 30 లోగా నాలుగో విడత చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే నాలుగవ విడతకు సంబంధించి అర్హుల జాబితాలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. విజయనగరం జిల్లాలో 36,478 గ్రూపులకు గాను రూ.252.31 కోట్లు నాలుగవ విడత ఆసరా నిధులు అకౌంట్‌లలో జమకానున్నాయి.

– కల్యాణచక్రవర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ వెలుగు, విజయనగరం

ప్రభుత్వమే రుణం తీర్చింది



సంతోషిమాత పొదుపు మహిళా సంఘంలో సభ్యురాలిని. మేము రూ.7.50 లక్షలు రుణం తీసుకున్నాం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుణమాఫీ ప్రకటించడంతో ఇప్పటికే మూడు విడతలు రుణమాఫీ జరిగింది. తాజా నాలుగవ విడత రుణమాఫీ వచ్చినట్లు సమాచారం వచ్చింది. ఈనెలలో నాలుగవ విడత రుణమాఫీ అవడంతో పూర్తిగా రుణాన్ని ప్రభుత్వం తీర్చినట్లే.

– కుప్పిలి సూర్యకుమారి, పూసపాటిరేగ

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు : డీఎంహెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరని సమానంగా పెంచాలన్నారు. బాలికలు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం బాలికల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. ఆడ పిల్లలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ఆడపిల్లలు లేనిదే సమాజం లేదన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ ఆర్.అచ్చుతకుమారి, డెమో చిన్నతల్లి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, చదలవాడ ప్రసాద్, దిశ ఎస్‌ఐ నారాయణరావు, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నాక్ గుర్తింపులో పరిశోధన పత్రాలు కీలకం

నెల్లిమర్ల రూరల్: నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు దోహదపడతాయని సెంచూరియన్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ప్రతి అధ్యాపకుడు పరిశోధనా పత్రాల తయారీలో పాల్గొని వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మొత్తం 35 పరిశోధనా పత్రాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ విజయ్‌బాబు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, సన్నీ డియోల్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.



అధ్యాపకులకు సూచనలు చేస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

భారీగా మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో అనధికారంగా మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 564 మద్యం క్వార్టర్ సీసాలను సీజ్ చేసినట్టు భోగాపురం ఎస్ఈబీ సీఐ ఎంవీఆర్.అప్పారావు శనివారం తెలిపారు. తిప్పలవలస గ్రామంలో కొంత కాలంగా అనధికారంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలిస్తున్నట్టు తెలిపారు. తీర ప్రాంతంలో అనధికారంగా బెల్టు షాపులో భారీగా మద్యం పట్టుబడినట్టు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్ఈబీ ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.



తిప్పలవలసలో భారీగా పట్టుబడిన మద్యం సీసాలు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి జంక్షన్‌లో మద్యం అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా.. ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 24 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించామని ఎస్ఐ రామగణేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి గరికిపేటలో బెల్టు షాపుపై దాడి చేసి 52 మద్యం సీసాలు సీజ్ చేశామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం బాటిళ్లతో ఎస్ఐ రామగణేష్, సిబ్బంది

జూదరుల అరెస్టు

బొండపల్లి: దేవుపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో జూదం ఆడుతుండగా 11 మంది జూదరులను అదుపులోకి తీసుకొని శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. జూదం ఆడుతున్న 11 మంది నుంచి రూ.9200 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

శోకసంద్రం

- అమెరికాలో మృతి చెందిన తెలుగు విద్యార్థి
- స్వగ్రామం చేరిన మృతదేహం



మృతి చెందిన సాయి నికేష్ (ఫైల్)

పాలకొండ: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన పాలకొండకు చెందిన ఓ విద్యార్థి విగతజీవిగా సొంతూరుకు శనివారం చేరాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో పాలకొండ శోకసంద్రమైంది. చదువే లోకంగా జీవించిన ఆ విద్యార్థి కలలు కల్లలయ్యాయి. తమ బిడ్డపై ఆ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... పాలకొండలోని బట్టి మఠం కాలనీలో రాకోటి వెంకటరమణ, ఆదిలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు రాకోటి సాయినికేష్(21), కుమార్తె లేఖ ఉన్నారు. సాయినికేష్ ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ కోసం గత నెల డిసెంబర్ ఆఖరులో అమెరికా వెళ్లాడు. హార్ట్‌ఫోర్టు సిటీలో సీక్రెడ్ యూనివర్సిటీలో సీటు రావడంతో అక్కడ ఎంఎస్‌లో చేరాడు. అమెరికా వెళ్లిన 15 రోజుల్లోనే ఈ నెల 12న శుక్రవారం తాను ఉంటున్న గదిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయినికేష్‌తో పాటు అదే గదిలో ఉంటున్న తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన మరో తెలుగు విద్యార్థి కూడా మృతి చెందాడు. విష వాయువు పీల్చడంతోనే వీరిద్దరు మృతి చెందినట్టు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శనివారం సాయినికేష్ మృతదేహం ఇక్కడకు రాగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా తమ బిడ్డ మృతికి పూర్తి కారణాలు తెలియడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయినికేష్ మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన సహచర విద్యార్థులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనతో పాలకొండ పట్టణంలో విషాదం అలముకుంది.

అత్యాచారం, కుల దూషణ కేసులో వ్యక్తికి జైలు

పార్వతీపురం టౌన్: అత్యాచారం, కులదూషణ కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎస్సీ, ఎస్టీ నాల్గవ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాష తీర్పును వెలువరించారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల గంగాపురం గ్రామానికి చెందిన బాధితురాలు 2019 సెప్టెంబర్ 16న పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను గంగాపురం గ్రామంలో తల్లిదండ్రులతో పాటు నివాసం ఉంటున్నానని, సుమారు 8 సంవత్సరాల క్రితం పులిగుమ్మి గ్రామానికి చెందిన పువ్వల పోలి అనే అతనితో వివాహం జరిగి ఒక కుమార్తె జన్మించిందని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త తాగుడికి బానిసై సరిగ్గా చూడకపోవడంతో కన్నవారి ఇంటికి వచ్చి ఉంటున్నానని తెలిపింది. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన పిరిడి పోలి పరిచయమై రెండో భార్యగా స్వీకరించి తన కుమార్తెను సక్రమంగా చూసుకుంటానని నమ్మించి లోబరచి గర్భవతిని చేశాడని పేర్కొంది. 2019 ఆగస్టు 3న అబ్బాయి పుట్టగా సదరు విషయం చెప్పగా తాను చూడడానికి రాకపోవడంతో జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులతో, పెద్దలతో చెప్పి పంచాయతీ పెట్టగా విషయం తెలుసుకొని నేరస్తుడు గ్రామం విడిచి వెళ్లిపోయాడని తెలిపింది. ఈ విషయమై తనకు జరిగిన అన్యాయంపై ముద్దాయి తల్లిదండ్రులకు ప్రశ్నించగా వారు తనను కులం పేరిట దూషించడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేసింది. దీనిపై తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. దీనిపై అప్పటి పార్వతీపురం రూరల్ ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు రుజువు కావడంతో ముద్దాయి పిరిడి పోలికి పదేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్టు ఎస్పీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి : పీఓ

పార్వతీపురం టౌన్: పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు విధిగా ముందుగా సందర్శించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై ఐటీడీఏ గిరమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాలు సందర్శించాలని, అక్కడ మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, ర్యాంపు, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండాలన్నారు. విద్యాశాఖ సంబంధిత పనులు చేపడుతుందని, సమన్వయం చేయాలని ఆయన సూచించారు. సెక్టార్ అధికారులు రూట్ పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.